ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 25 జూలై 2024 | 5





ఆలమూరు: జొన్నాడ పుష్కర్‌ఘాట్ వద్ద వరద

నిలకడగా

భద్రాచలం వద్ద తగ్గినా..
ఇక్కడ పెరుగుతోంది
వరద ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన
పునరావాస చర్యలపై సమీక్ష

అమలాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి):గత కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన గోదావరి వరద ప్రస్తుతం నిలకడగా కొనసాగుతోంది. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద వరద ప్రవాహం తగ్గుముఖం పడుతున్నప్పటికీ కోనసీమ జిల్లాలోని నదులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. వశిష్ఠ, వైనతేయ, గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయల్లో వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువ నుంచి వచ్చిన వరద కోనసీమలోని వివిధ ప్రాంతాల్లో బంగాళాఖాతంలో కలుస్తుంది. దానివల్ల ప్రస్తుతం వరద తీవ్రత నిలకడగా కొనసాగుతుండడంతో గోదావరి నదీ పరివాహక ప్రాంతాల వెంబడి ఉన్న లంక గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. వరద తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ ఉదయమే జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. బుధవారం వరద ప్రభావం లేని ప్రాంతాల్లో విద్యా సంస్థలు యథావిధిగానే పనిచేశాయి. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో పాఠశాలలకు మాత్రమే విద్యాశాఖ అధికారులు సెలవు ప్రకటించారు. ఇదిలా ఉండగా నదీపాయల మధ్యలో ఉన్న కాజ్‌వేలు వరద నీటిలో చిక్కుకోవడంతో అనేక ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. దిండి రిసార్ట్స్ సైతం వరదనీటిలో చిక్కుకుంది. అప్పనపల్లి వెళ్లే భక్తులకు వరద ఆటంకం కలిగించింది. ఇక నదీపరివాహక లంక గ్రామాల్లో ఉన్న పంటపొలాలకు నష్టం వాటిల్లింది. ఆకు, కూరగాయల పంటలు, వరద నీటిలో మునగడంతో పూర్తిగా పాడైపోయే అవకాశాలు ఉన్నాయి. లంకల్లో ఉండే పశువులను సైతం సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఏటిగట్లు, బలహీనవంగా ఉన్న వంతెనలు, కల్వర్టులు పునర్నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేయాలని కలెక్టర్ వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనకు వెళ్లినప్పుడు స్థానిక అధికారులకు ఆదేశాలిచ్చారు.

పునరావాస చర్యలు

వరద ప్రభావం కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 12 మండలాల్లో 34 గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యాయి. వీరి కోసం 37 బోట్లు ఏర్పాటు చేశారు. ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని సిద్ధం చేశామని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. ముందు జాగ్రత్తగా 75 పునరావాస కేంద్రాలను సిద్ధం చేయగా, రెండు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించారు. 809 మందిని తరలించారు. వీరికి 882 పులిహోర పొట్లాలు, 386 మందికి అల్పాహారం, 1660 వాటరు ప్యాకెట్లు, 20 లీటర్ల వాటర్ టిన్‌లు 2631 సరఫరా చేశామని, ఐదు ఇళ్లకు నష్టం కలిగిందని కలెక్టర్ తెలిపారు. 3266 మంది రైతులకు సంబంధించి 1462.48 హెక్టార్లలో హార్టీకల్చర్ పంటలు దెబ్బతిన్నాయని, వ్యవసాయానికి సంబంధించి 3374 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 60 వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి సేవలు అందిస్తున్నారు.



అల్లవరం: బోడసకుర్రు వైనతేయ వరద నీటిలో మత్స్యకార ఇళ్లు



పి.గన్నవరం అక్విడెక్టు మధ్య వరద



మామిడికుదురు..
పాశర్లపూడిలో వరదనీట మునిగిన కనకదుర్గమ్మ ఆలయం

లంక గ్రామాలకు చేరిన వరద

ముమ్మిడివరం/మండపేట/పి.గన్నవరం



ముమ్మిడివరం: కూనాలంక రామాలయం వద్ద రోడ్డుపై వడిగా ప్రవహిస్తున్న వరదనీరు



పి.గన్నవరం: నాగుల్లంకలో ముంపునకు గురైన అరటి





కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలో గోదావరి ముంపులో ఉన్న దొండ



కపిలేశ్వరపురం మండలంలో నీటి ముంపులో కొబ్బరి మొక్కలు



పి.గన్నవరం: నాగుల్లంకలో ముంపునకు గురైన తమలపాకు పంట

కె.గంగవరం మండలం కోటలో నీట మునిగిన బొప్పాయి



ఆలమూరు: వరదనీటిలో అరటి పంట



ముమ్మిడివరం: లంకాఫ్ ఠాణేలంకలో కొబ్బరికాయల తరలింపు



కె.గంగవరం మండలం కోటలో బొప్పాయి భద్రపరుస్తున్న దృశ్యం

కష్టం..నష్టం

గోదావరి వరద నీరు పోటెత్తడంతో నిండా మునిగిన ఉద్యానవన పంటలు

ముంపు ప్రాంతాల్లో నష్టపోయిన రైతులు
వందలాది ఎకరాల్లో పంట నీట మునక
అరటి, బొప్పాయి, తమలపాకు, కూరగాయల పంటకు దెబ్బ

పి.గన్నవరం, జూలై 24: గత వారం రోజులుగా వర్షాలు, వరదలు కోనసీమ జిల్లా రైతులను కుదిపేస్తున్నాయి. వరద ఉధృతి కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటలు గోదారమ్మ ఒడిలోకి వెళ్లిపోయాయి. కూరగాయల పంటలు నిలువునా మునగడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. అలాగే వాణిజ్య పంటల్లో ఒకటైన తమల పాకు రైతన్నలు కూడా నష్టాలు చవి చూడవల్సిందేననే ఆందోళన వ్యక్తమవుతోంది. వరద ఉధృతి నిలకడగా ఉండటంతో ఉద్యానవన అధి కారులు నష్టాలు లెక్కలు చూసే పనిలో భాగంగా మండలాలు వారీగా నీట మునిగిన పంటల అం చనాలు రూపొందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 3266 మంది రైతులకు సంబంధించి 1462 ఎకరాల్లో ఉద్యాన పంటలు ముంపునకు గురైనట్లు అధికారులు అంచనాలు రూపొందించారు. అమలాపురం పరిధిలోని అమలాపురం, మామిడికుదురు, అంబాజీపేట మండలాలకు సంబంధించి అరటి 90 మంది రైతులకు గాను 37 ఎకరాలు, కూరగాయలు 125 మంది రైతులకు గాను 51 ఎకరాలు, తమలపాకు ఆరుగురు రైతులకు గాను 80 సెంట్లలో పంట నీట మునిగినట్లు అంచనా వేశారు. అలాగే అయినవిల్లి పరిధిలోని అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాలకు సంబంధించి అరటి 558 మంది రైతులకు గాను 266.98 ఎకరాలు, కూరగాయలు 1413 మంది రైతులకు గాను 417.10 ఎకరాలలో పంటలు నీటమునిగాయి. రాజోలు పరిధిలోని పి.గన్నవరం మండలానికి సంబంధించి అరటి 448 మంది రైతులకు గాను 113.20 ఎకరాలు, కూరగాయలు 510 రైతులకు గాను 143.20 ఎకరాలు, బొప్పాయి ఐదుగురు రైతులకు గాను 1.2 ఎకరాల పంటలు నీటమునిగాయి. కొత్తపేట పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, కపిలేశ్వరపురం, ఆలమూరు మండ లాలకు సంబంధించి అరటి 138 మంది రైతులకు గాను 84.80 ఎకరాలు, కూరగాయలు 463 మంది రైతులకు గాను 200.80 ఎకరాలు, బొప్పాయి 15 మంది రైతులకు గాను 8 ఎకరాలు, పువ్వులు 15 మంది రైతులకు గాను 6.80 ఎకరాల్లో పంట నీట మునిగింది. రామచంద్రపురం పరిధిలోని కె.గంగవరం, రాయవరం మండలాలకు సంబంధించి 99 మంది రైతులకు గాను 32.40 ఎకరాలు, కూరగాయలు 312 మంది రైతులకు గాను 72 ఎకరాలు, బొప్పాయి 32 మంది రైతులకు గాను 12 ఎకరాలు వరద తాకిడికి గురైనట్లు సంబంధిత అధికారులు అంచనాలు రూపొందించారు. అయితే వరద ఉధృతి పూర్తిగా తగ్గిన తర్వాత ఏ పంటకు ఎంతమేర నష్టం వాటిల్లింది అనే విషయంపై ప్రభుత్వం ఆదేశాల మేరకు నష్టాల వివరాలను నమోదు చేయనున్నారు. పి.గన్నవరం మండలంలో ఉద్యానవన శాఖ అధికారి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ముంపునకు గురైన పంటల వివరాలను నమోదు చేశారు.



మామిడికుదురు: అప్పనపల్లిలో ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు



అప్పనపల్లిలో వరద నీట మునిగిన ఇందిరమ్మ కాలనీ



అన్నదాతలను ఆదుకోండి

అధ్యక్షా..

రైతుల తరపున అసెంబ్లీలో గళం వినిపించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, జూలై 24: ధాన్యం అమ్మకాలు చేసిన రైతులకు బకాయిలు చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అవలంబించిన అస్తవ్యస్త విధానాల వల్ల వరి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆ విధానాలను పునఃసమీక్షించి తెలుగుదేశం ప్రభుత్వం గతంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అనుసరించిన ర్యాండమ్ పద్ధతిని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. రైతులు తమ ధాన్యాన్ని దగ్గర లోని రైస్ మిల్లులకు అమ్ముకునేలా గతంలో ఉండేదని ఆ విధానం వల్ల ఇబ్బందులు లేకుండా ఉండేవన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ క్రాప్, వేలిముద్ర ద్వారా రైతు వివరాలు, సీపీఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం వల్ల సరైన సమయంలో బిల్లులు రాక ఆందోళన చేసి రోడ్డెక్కే పరిస్థితులు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.1000 కోట్లు రైతులకు విడుదల చేయడాన్ని ప్రశంసించారు. అలాగే మిగిలిన రూ.674 కోట్లను త్వరలో విడుదల చేయాలని ఒక్క కోనసీమ జిల్లాలోనే రూ.154 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎడతెరిపిలేని వర్షాల వల్ల వరినాట్లు దెబ్బతిన్నాయని దీంతో మరొక సారి నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

బకాయిలను చెల్లించాలి

నీటి సంఘాలను ఏర్పాటు చేసి ఇరిగేషన్ వ్యవస్థను పటిష్టపరచాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూలై 24: రైతులకు ఇంకా చెల్లించాల్సిన రూ.674 కోట్ల బకాయిలు కూడా త్వరితగతిన చెల్లించాలని అసెంబ్లీలో బుధవారం మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే రూ.1000 కోట్ల బకాయిలు చెల్లించి రైతులను ఆదుకున్నందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పంట కాల్వలు, డ్రైన్‌లు ఆధునికీకరించకపోవడం వల్ల పంటలు మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రతిఏటా వర్షాకాలంలో పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. 1997లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు నీటి సంఘాలను ఏర్పాటు చేసి ఇరిగేషన్ వ్యవస్థను గాడిలో పెట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జేసీ



కలెక్టరేట్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న నిషాంతి

జేసీగా నిషాంతి బాధ్యతల స్వీకరణ

అమలాపురం టౌన్, జూలై 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మూడో జాయింట్ కలెక్టర్‌గా టి.నిషాంతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. తొలుత వేద పండితులు పూర్ణకుంభంతో నిషాంతికి స్వాగతం పలికారు. చాంబర్‌లో పూజా కార్యక్రమాల అనంతరం బాధ్యతలు స్వీకరించిన నిషాంతికి వేదాశీర్వచనాలు అందించారు. తమిళనాడుకు చెందిన నిషాంతి 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఏపీ కేడర్‌లో తొలుత ప్రకాశం జిల్లా సహాయ కలెక్టర్‌గా శిక్షణ పొందారు. అనంతరం పెనుగొండ సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. అనంతపురం జిల్లా గృహనిర్మాణ సంస్థ జాయింట్ కలెక్టర్‌గా, నంద్యాల జేసీగా పనిచేశారు. అమరావతిలోని రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో జాయింట్ కార్యదర్శిగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు జేసీగా నియమితులయ్యారు. తొలుత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

జేసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా సామాజిక బాధ్యతగా కలెక్టరేట్ ప్రాంగణంలో ఫలసాయాన్ని ఇచ్చే కొబ్బరి, జామ, మామిడిమొక్కలు నాటారు.కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి పాల్గొన్నారు.



గోదావరి వరద నీటితో పి.గన్నవరం అక్విడెక్టు వద్ద ప్రవాహం ఉధృతంగా ఉంది. అయితే అక్కడ ప్రమాదకరంగా కొంతమంది యువకులు సెల్ఫీలు తీసుకుంటున్నారు. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్విడెక్ట్ వద్ద పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పి.గన్నవరం..



భైరవపాలెం సముద్రంలో

బోటు బోల్తా

7లో

ఆరుగురు మత్స్యకారులు సురక్షితం

రెవెన్యూ రికార్డులు జరభద్రం

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, జూలై 24: రెవెన్యూ కార్యాలయాల్లోని రికార్డులను అత్యంత సురక్షితంగా భద్రపరిచి రోజువారీ నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆయన ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి రెవెన్యూ రికార్డుల భద్రతపై దిశానిర్దేశం చేశారు. మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను ధ్వంసం చేసిన అనుమానాస్పద సంఘటనలో ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన ఫైల్స్ కోల్పోవడంతో రెవెన్యూ రికార్డుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక సూచనలు చేసిందన్నారు. ఆర్డీవోలు తమ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి రికార్డు రూముల స్థితిగతులపై వారం లోగా నివేదిక సమర్పించాలన్నారు. ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల రెవెన్యూ రికార్డుల రక్షణకు కార్యాలయాల చుట్టూ నిఘా ఉంచాలన్నారు. ప్రతీ తహసీల్దార్ కార్యాలయంలో కనీసం రికార్డుల భద్రతపై నాలుగు సీసీ కెమెరాల చొప్పున ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ రెవెన్యూ కార్యాలయంలోను డేటాను భద్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక పరంగా కూడా రికార్డుల భద్రతపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ రికార్డులు, రిజిస్టర్లు ఉంచే రూముల వద్ద అగ్నిమాపక నివారణా చర్యలు ఉండేలా చూసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ భూపరిపాలన ముఖ్య కమిషనర్ సూచనల మేరకు రోజువారీగా జిల్లా రెవెన్యూ అధికారికి రికార్డుల భద్రతపై నివేదిక సమర్పించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏవో సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.



వరద ముంపులో వీఆర్ పురం మండలం శ్రీరామగిరి

కాకి లెక్కలు

(రంపచోడవరం)

పోలవరం ప్రాజెక్టు కింద అల్లూరి జిల్లాకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఉన్న ముంపు లెక్కలన్నీ గోదావరి వరదలతో కాకి లెక్కలుగా తేలిపోతున్నాయి. పోలవరం తొలి దశ +41.15 మీటర్లకు మించిన కాంటూరు స్థాయిలో ప్రభావితమయ్యే ఆవాసాలన్నీ వరద ప్రభావితమయ్యాయి. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల దశలో సంపూర్ణతకు సమయం పట్టే పరిస్థితుల్లో తొలి దశగా 41.15 మీటర్ల స్థాయిలో నీటిని నిల్వ చేసేందుకు గత ప్రభుత్వం వేసిన ముంపు లెక్కలు తప్పుతున్నాయి. ప్రాజెక్టు మొదటి దశ స్థాయికి అంచనా వేసిన ముంపు కంటే ముంపు తీవ్రత ఎక్కువగా ఉంటుందని గత రెండు గోదావరి వరదలతో పాటు తాజాగా వచ్చిన వరదలు మరోమారు స్పష్టం చేశాయి. తొలి దశలో దేవీపట్నం మండలంలోని 44 ఆవాసాలతో పాటు రెండు విలీన మండలాల్లో 21 ఆవాసాలు మాత్రమే ముంపునకు గురవుతాయని అధికార లెక్కలు చెప్తుంటే

- పోలవరం ముంపు లెక్కలను చెరిపేసిన గోదావరి వరద
- 41.15 మీటర్ల స్థాయిలో రెండు విలీన మండలాల్లో 19 ఆవాసాలకే ముంపు
- నాలుగు విలీన మండలాల్లో 100కు పైగా ఆవాసాలపై వరద ప్రభావం

తాజా వరదలు నాలుగు విలీన మండలాల్లో +46 మీటర్ల కాంటూరు స్థాయిలో ఉన్న ఆవాసాలన్నిటిపైనా ప్రభావం చూపాయి. ఈ విధంగా అవి 100కు పైగా ఆవాసాలను ప్రభావితం చేశాయి. ఈ ప్రకారం చూస్తే పోలవరం ముంపు ప్రభావిత అంచనాలకు ఐదు రెట్లకు మించిన ముంపు ఈ వరదల్లో కానవస్తోంది. పోలవరం గత అధికారుల అంచనా లెక్కలు నిజమా లేక ముంచెత్తిన వరద లెక్కలు నిజమా అన్నది చర్చనీయాంశమైంది.

నిజానికి పోలవరం ప్రాజెక్టు కింది 45.72 మీటర్ల స్థాయిలో నీటిని నిల్వ చేయాలన్నది లక్ష్యం. కాగా ఆచరణలో ఇప్పటికి ఇది సాధ్యం కాదని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 41.15 మీటర్ల స్థాయిలో మొదటి దశతోనే నీటిని నిల్వ చేసి ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలని నిశ్చయించాయి. తొలి దశలో ముంపు తీవ్రత అల్లూరి జిల్లా దేవీపట్నం, వీఆర్ పురం, కూనవరం మండలాల్లోని 63 ఆవాసాల్లో 5,618 మంది నిర్వాసిత కుటుంబాలపై ప్రభావం చూపాలి. అయితే గోదావరికి వచ్చిన వరదలను పరిశీలిస్తే పోలవరం ముంపు అంచనాలు తప్పవుతున్నాయి. తాజాగా వచ్చిన గోదావరి వరదలు పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ వద్ద 34 మీటర్లను దాటి వరద ప్రవహించలేదు. కానీ వరదకు మునిగిపోయిన గ్రామాల లెక్కలు మాత్రం పోలవరం ప్రాజెక్టు తొలి దశ (+41.15 మీటర్ల)కు మించే ఉన్నాయి.

మొదటి దశలో దేవీపట్నం మండలంలోని 44 ఆవాసాలు మునిగిపోతాయి. ఇందులో తాజా వరదల లెక్కలతో పోల్చినా ఎటువంటి వివాదం లేదు. కానీ విలీన మండలాల విషయానికొస్తే తొలి దశలో కేవలం వీఆర్ పురం మండలంలోని 18 ఆవాసాల్లో 2128 నిర్వాసిత కుటుంబాలు, కూనవరం మండలంలోని ఒక గ్రామంలో 216 నిర్వాసిత కుటుంబాలు మాత్రమే ప్రభావితం కావాలి. కానీ ఇప్పుడు ఎదురైన గోదావరి నాలుగు విలీన మండలాల్లోని 100కు పైగా ఆవాసాల్లో 10వేల నిర్వాసిత కుటుంబాలను ప్రభావితం చేశాయి. ఈ పోలవరం లెక్కలను, వరద లెక్కలను పరికించి చూస్తే వాస్తవ విరుద్ధంగా పోలవరం ముంపు లెక్కలు ఉన్నాయన్నది గోదావరి సాక్షిగా తేటతెల్లమవుతోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ విలీన మండలాల నిర్వాసితులు వరదలు వచ్చిన ప్రతిసారీ తమకు పరిహారాలను చెల్లించేసి, పునరావాసాన్ని కల్పిస్తే గ్రామాలు ఖాళీ చేసేస్తామని ఎక్కడికక్కడ అధికారులను నిలదీసేవారు. కానీ వారికి ఎక్కడా న్యాయం జరగలేదు. దీంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి ఇక్కడి ప్రజలు సరైన గుణపాఠమే చెప్పారు. కూటమి ప్రభుత్వ పాలనలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావంతో ఉన్నారు.



సీట్లతో అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకుడు

పార్వతి అమ్మవారికి సారె మహోత్సవం

150 రకాల స్వీట్లు సమర్పించిన భక్తులు

బిక్కవోలు, జూలై 24: తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామంలోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయంలో వున్న పార్వతి అమ్మవారికి సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం సారె మహోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి సత్యనారాయణశర్మ, రఘు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామోత్సవంలో భక్తులు తీసుకువచ్చిన సారెతో పాటు గ్రామానికి చెందిన చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులతో పాటు 150 రకాల స్వీట్లు అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సారెను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

బాలల వికాస గ్రామాలు నెలకొల్పాలి

సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జూలై 24: జిల్లాల్లో బాలల వికాస గ్రామాలను నెలకొల్పేందుకు కృషి చేయాలని సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ కోరారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం అవరణలో 11 జిల్లాలకు చెందిన రెండో బ్యాచ్ డీఎల్ఎంటీలకు మూడు రోజుల శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్య, విద్యా రంగాలను సుస్థిరాభివృద్ధి సాధనలోని బాలల వికాస గ్రామం కోసం వనరులను ఎలా వినియోగించు కోవాలో వివరించారు. 11 జిల్లాలకు చెందిన మెడికల్, ఐసీ డీఎస్, పంచాయతీరాజ్ శాఖల డీఎల్ఎంటీలు హాజరయ్యారు. ఫ్యాకల్టీలు శ్రీదేవి, శ్రీనివాసరావు, నీహారిక, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పద్మజ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ధవళేశ్వరం బ్యారేజీ ఎగువున, దిగువున వరద ప్రవాహం

తగ్గుముఖం

- ధవళేశ్వరం వద్ద అత్యధికంగా 14.90 అడుగులకు పెరిగిన నీటిమట్టం
- 14,56,651 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 24: గత ఐదు రోజులుగా పెరుగుతూ ప్రవహించిన గోదావరి తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం ఇప్పటికే తగ్గింది. ఇంద్రావతి పరివాహకంలో కురిసిన వర్షాల వల్ల పేరూరు వద్ద గోదావరి నీటిమట్టం మరలా పెరుగుతోంది. ధవళేశ్వరం వద్ద బుధవారం తెల్లవారుజామున 14.90 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం ఆపై 8 గంటల పాటు నిలకడగా కొనసాగింది. మధ్యాహ్నం 12 గంటలకు నెమ్మదించి రాత్రి 7 గంటలకు 14.60 అడుగులుగా నమోదయ్యింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 14.04 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి వదిలారు. అత్యధికంగా 14,56,651 క్యూసెక్కులు ప్రవాహం సముద్రంలోకి ప్రవహించింది. ప్రస్తుతం ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. నీటిమట్టం తగ్గుముఖం పడుతుండడంతో గురువారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే స్థాయికి నీటి మట్టం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఎగువున భద్రాచలం వద్ద క్రమేపీ తగ్గుతున్న నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 45.20 అడుగులుగా నమోదైంది. రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఇంద్రావతి పరివాహకంలో కురిసిన వర్షాల వల్ల పేరూరు వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతుండగా... దాని ప్రభావంతో భద్రాచలం వద్ద మరలా రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి నీటిమట్టం పెరగవచ్చని అంచనా.

బుధవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద నీటిమట్టం 11.45 మీటర్లు నమోదు కాగా తగ్గుముఖం పట్టింది. పేరూరు వద్ద 16.38 మీటర్లు నమోదు కాగా పెరుగుతోంది. దుమ్ముగూడెం వద్ద 12.03 మీటర్లు, భద్రాచలం వద్ద 45.20 అడుగులు, కూనవరం వద్ద 20.62 మీటర్లు, కుంట వద్ద 12.10 మీటర్లు, పోలవరం వద్ద 13.32 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.92 మీటర్లుగా నీటిమట్టాలు నమోదయ్యాయి.

శాంతించిన శబరి

- చింతూరు వద్ద 39 అడుగులకు శబరి నీటిమట్టం
- డొంకరాయి జలాశయంలో ప్రమాద స్థాయిలో నీటిమట్టం
- ఏ క్షణంలోనైనా నీటిని విడుదల చేస్తామంటున్న జెన్‌కో అధికారులు

చింతూరు, జూలై 24: శబరి ఉధృతి కాసింత ఊరటనిచ్చింది. మంగళవారం రాత్రి 41.6 అడుగులు ఉన్న నీటిమట్టం బుధవారం రాత్రికి మరింత తగ్గి 39 అడుగులకు చేరుకుంది. భద్రాచలం వద్ద గోదావరి బుధవారం సాయంత్రానికి 45.2 అడుగులకు చేరుకోగా గురువారం ఉదయానికి తిరిగి 48 అడుగులకు చేరుకోవచ్చని సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువున కుండపోతగా వర్షం కురుస్తుండడమే ఇందుకు కారణమని చెప్తున్నారు. ముంపు కారణంగా చింతూరు డివిజన్ పరిధిలోని 82 ఆవాసాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వరద కారణంగా పలు ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పాటు తీగలపై చెత్త పేరుకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. చింతూరు డివిజన్లో ఇప్పటివరకు 11 ఆవాసాలు పూర్తిగా నీట మునిగాయి. 54 గ్రామాలకు చెందిన రహదారులు జలదిగ్బంధంలో వున్నాయి. ముందు జాగ్రత్తగా లోతట్టు ప్రాంతాలకు చెందిన 960 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పలు బాధిత కుటుంబాలు అడవులు, గుట్టల్లో పాకలు వేసుకున్నాయి.

మోతుగూడెం: డొంకరాయి జలాశయంలో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరువలో ఉంది. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు. ఈ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుధవారం నాటికి నీటిమట్టం 1035.20 అడుగులకు పెరిగింది. దీంతో జెన్‌కో అధికారులు



అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ వాగుల నుంచి జలాశయంలోకి ప్రస్తుతం 8వేల వరకు ఇన్‌ఫ్లోస్ వస్తున్నట్టు అంచనా వేస్తున్నారు. బుధవారం రాత్రి 10 గంటల వరకు ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. నీటిమట్టం 1036 అడుగులకు పెరిగితే వెంటనే దిగువకు నీటిని విడుదల చెయ్యడానికి అధికారులు సమాయత్తమయ్యారు. దిగువ ప్రాంతాల ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కోసం 2300 క్యూసెక్కుల నీటిని పవర్ కెనాల్‌లోకి విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికారులు చెప్పారు.



చింతూరు డివిజన్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

వరద ముంపులో కలెక్టర్ పర్యటన... బాధితులతో మమేకం

చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ బృందం బుధవారం చింతూరు డివిజనులోని వరద ప్రభా విత ప్రాంతాల్లో పర్యటించింది. అధికారులు నాటు పడవలు, ట్రాక్టర్లు, లాంచీలు, కాలినడకన ప్రయాణం చేసి వలస గుడిసెల వద్దకు చేరుకున్నారు. బాధితులతో మమేకమై సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. బాధిత కుటుంబా లకు ప్రభుత్వం తరఫున బియ్యం, కందిపప్పు, పామాయిలు, కిరోసిన్, కూరగాయలు సరఫరా చేశారు. వరరామచంద్రపురం మండలం కల్లనూరుకు చెందిన బాలింత లక్ష్మిని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తన వాహనంలో చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.



వరదలోనే విధులు

ఎటపాక, జూలై 24: గోదావరి వరదలకు 11కేవీ విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు, ఎండిన పుల్లలు, చెత్త చిక్కుకున్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది బుధవారం వరద ప్రవాహంలోనే నాటు పడవలపై వెళ్లి వాటిని తొలగించారని జేఈ గెల్లంకి రాజ్‌కపూర్ చెప్పారు. వీరాయిగూడెం గ్రామ శివారుతో పాటు రాయనపేట-గుండాల మధ్యలో వాగు ప్రాంతంలోని లైన్లు, నందిగామ గ్రామ శివారులోని స్తంభాలపై చిక్కుకున్న చెత్తను, ఎండిన పుల్లలను లైన్‌మన్ దేవేందర్ నాయక్, జేఎల్ఎం వీరబాబు తొలగించారు. అప్పటివరకు ఈ గ్రామాలకు వేరే ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేశారు. విద్యుత్ సిబ్బందిని పలువురు ప్రశంసించారు.

నందిగామ వద్ద విద్యుత్ స్తంభంపై చెత్తను తొలగిస్తున్న సిబ్బంది



గ్యాస్ కంపెనీ యజమాని నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్ఐ

హెచ్‌పీ గ్యాస్ కంపెనీ కార్యాలయంలో భారీ చోరీ

షట్టరు తాళాలు పగులగొట్టి రూ.1.50 లక్షల నగదు. 2 సెల్‌ఫోన్ల చోరీ

అనపర్తి, జూలై 24: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి కెనాల్ రోడ్డులోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో భారీ చోరీ జరిగింది. అనపర్తి ఎస్ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయ షట్టరు తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. రూ.1.50 లక్షల నగదుతో పాటు కంపెనీకి చెందిన రెండు సెల్‌పోన్లతో ఉడాయించారు. విషయం తెలుసుకున్న యజమాని కర్రి సాంబశివరెడ్డి పోలీసులను ఆశ్రయించడంతో సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు సంఘటనాస్థలాన్ని పరిశీలించి యజమాని నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరిస్తోందని, సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని సీఐ వివరించారు. యజమాని సాంబశివరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు చెప్పారు.




బోల్తా పడిన బోటు, సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు

భైరవపాలెం సముద్రంలో బోటు బోల్తా

ఆరుగురు మత్స్యకారులను రక్షించిన 'రిలయన్స్' సిబ్బంది

ఐ.పోలవరం, జూలై 24: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలెం సముద్రంలో బుధవారం ఉదయం ఒక బోటు బోల్తా పడింది. భైరవపాలేనికి చెందిన పెమ్మాడి సూర్యారావు, దండుప్రోలు ఆదినారాయణ, కర్రి శామ్యూల్, పెమ్మాడి మల్లయ్య, పాలెపు ధర్మారావు, డొక్కాడి దొరబాబు సోమవారం సాయంత్రం రిలయన్స్ జెట్టీ సెక్యూరిటీలో పెట్రోలింగ్ విధుల నిమిత్తం ఇంజన్ బోటులో సముద్రంలోకి వెళ్లారు. సముద్ర అలల ఉధృతికి అది బోల్తా పడింది. మత్స్యకారులను రిలయన్స్ సంస్థ సిబ్బంది రక్షించి సురక్షిత ప్రాంతానికి చేర్చారు. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వేధింపుల ఘటనపై విచారణ

- కాకినాడ జిల్లా ఫైలేరియా అధికారిణి ఫిర్యాదు ఘటనపై విచారణకు ఆదేశించిన కలెక్టర్
- డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ని విచారణాధికారిగా నియమించిన వైనం
- తన కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని బాధితురాలి ఫిర్యాదు
- దీని ఆధారంగా ఇటీవల రాధాకృష్ణపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు
- ఈలోపు గోదావరిలో దూకి గల్లంతైన సీనియర్ అసిస్టెంట్
- వివాద ఘటనపై మళ్లీ పూర్తిస్థాయి విచారణకు ఆదేశించిన కలెక్టర్

కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఫైలేరియా విభాగం సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆ విభాగం ఉన్నతాధి కారిణి ఇచ్చిన ఫిర్యాదుపై లోతైన విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు పూర్తిస్థాయి విచారణకు డీఆర్డీఏ పీడీని నియమిం చారు. వాస్తవానికి ఈ విభాగం ఉన్నతాధికారి 15 రోజుల కిందట తన కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేస్తూ డీఎంహెచ్‌వో నరసింహ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా వైద్య, ఆరోగ్య శాఖ డిప్యూటీ డీఎంహెచ్‌వో శాంతి విచారణ చేపట్టారు. అసలు ఆ రోజు ఏం జరిగింది? ఛాంబర్‌లో ఉన్న మహిళా అధికారిణితో సీనియర్ అసిస్టెంట్ ఏ విధంగా ప్రవర్తించారు? దీనికి కారణాలేంటనే దానిపై బాధితురాలి నుంచి వివరణ తీసుకున్నారు. బాధితురాలి ఆరోపణలపై ఏం సమాధానం చెప్తారని సదరు సీనియర్ అసిస్టెంట్ వివరణ కూడా తీసుకున్నారు. దీనికి సంబంధించి విచారణ నివేదికను విచారణాధికారి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి ఈ నెల 17న అందించారు. నివేదికలో ఏం తేల్చారనే విషయం ఇంకా బయటకు రాలేదు. కానీ ఈలోపు సదరు సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ మంగళవారం యానాం వద్ద గోదావరిలో దూకి గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో వివాదం ముదరడంతో మరోసారి సదరు బాధితురాలికి జరిగిన అన్యాయం, అసలు ఆ రోజు ఏం జరిగింది? అనే దానిపై వాస్తవాలు వెలికితీసేలా కొత్తగా జిల్లా డీఆర్డీఏ పీడీతో విచారణ చేయించాలని కలెక్టర్ నిర్ణయించారు. మరోపక్క ఈ వివాదానికి సంబంధించి బుధవారం తన కార్యాలయంలో డీఎంహెచ్‌వో మీడియాతో మాట్లాడారు. ఫైలేరియా విభాగ ఉన్నతాధికారి అయిన బాధిత మహిళ తన వద్ద పనిచేసే సీనియర్ అసిస్టెంట్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఈ నెల 2న తమకు ఫిర్యాదు చేశారన్నారు. తనను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయ గదిలో ఇద్దరం పక్కపక్క సీటులోనే కూర్చున్నామని, ఈ క్రమంలో తనతో సీనియర్ అసిస్టెంట్ అసభ్యంగా ప్రవర్తించారని బాధితురాలైన అధికారి తమకు వివరించారన్నారు. ఈ నేపథ్యంలో సదరు ఉద్యోగిని తాను సరెండర్ చేస్తున్నానని పేర్కొంటూ బాధిత అధికారి లేఖ ఇచ్చారు. సరెండర్ ఆమోదించే అధికారం తనకు లేదని, కావాలంటే రాధాకృష్ణను వేరేచోటకు బదిలీ చేస్తానని సదరు బాధితరాలైన అధికారికి చెప్పానన్నారు. కానీ తనకు సదరు సీనియర్ అసిస్టెంట్ ప్రవర్తన, పని విధానం నచ్చలేదని ఆమె తనతో చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో సదరు బాధితురాలి ఫిర్యాదుపై విచారణ చేపట్టామన్నారు. 17న నివేదిక వచ్చిందని, దానికి సంబంధించి ఇంకా చర్యలు కూడా ప్రారంభించలేదని, కానీ ఈలోపు రాధాకృష్ణ నదిలోకి దూకారన్న సమాచారం తెలిసిందని వివరించారు.

ఫైలేరియా అధికారిణిపై బదిలీ వేటు

జీజీహెచ్ (కాకినాడ), జూలై 24 జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఓ సీనియర్ అసిస్టెంట్ గోదావరిలో పడి గల్లంతవ్వడానికి ఆమె కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యాధికారిణి పై కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ బుధవారం రాత్రి బదిలీ వేటు వేశారు. ఆమెను తొండంగి మండలం కేపీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు.

తుని ఏరియా ఆసుపత్రిలో కుప్పకూలిన పైకప్పు

ఘటనా స్థలంలో 12 మంది రోగులు.. తప్పిన ప్రమాదం

తుని రూరల్, జూలై 24: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కాకినాడ జిల్లా తుని ఏరియా ఆసుపత్రిలో శ్లాబు నుంచి నీరుదిగడంతో పైకప్పు కుప్పకూలింది. మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో ఆర్థోపెడిక్ వార్డులో ఈ ఘటన జరిగింది. పై కప్పు కూలి కింద ఉన్న సీలింగ్ మీద పడే క్రమంలో పెద్ద శబ్ధం రావడంతో ఆ వార్డులో ఉన్న 12 మంది రోగులు పరుగులు తీశారు.



డ్యూటీ నర్సులు, వైద్యాధికారుల ఆదేశాల మేరకు వారిని మరో వార్డుకు షిఫ్ట్ చేశారు. ఈ ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే యనమల దివ్య... భవనాల పటిష్టతను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ తాతారావు

గోకవరం, జూలై 24: ప్రకృతి వ్యవసాయ విధానం అవలంబించడం వల్ల రైతులకు, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ తాతారావు అన్నారు. మండలంలోని వీరలింకపల్లి గ్రామంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం ఆయనతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రైతులు, వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగు విధానం, పంట దిగుబడి, పెట్టుబడి తదితర విషయాలను ప్రాజెక్టు మేనేజర్ తాతారావు రైతులకు వివరించారు. ప్రకృతి సాగులో వినియోగించే బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానాన్ని కూడా తెలిపారు. పాడి పరిశ్రమతో పాటు ప్రకృతి విధానంలో తాను సాగు చేస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయ క్షేత్రానికి చెందిన రైతు కోరిపల్లి అప్పలస్వామి వివరించాడు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

కొత్తపేట, జూలై24:ద్విచక్రవాహనదారులుహెల్మెట్ ధరించాలని కొత్తపేట సీనియర్ సివిల్‌జడ్జి రమణారెడ్డి చెప్పారు. రోడ్డు భద్రతపై న్యాయవాదులు, పోలీసు అధికారులతో కలిసి కోర్టు ప్రాంగణం నుంచి వాడపాలెం సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లాన్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బీసీహెచ్ పాపారావు ఆధ్వర్యంలో హెల్మెట్ ఆవశ్యకతపై సదస్సు నిర్వహించారు.

ఎంపీడీవో మృతికి సంతాపం



అమలాపురం: మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

అమలాపురం రూరల్, జూలై 24: నర్సాపురం ఎంపీడీవో ఎం వీ రమణారావు బలవన్మరణానికి సంతాపం తెలుపుతూ బుధవారం అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఎంపీడీవో జి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో రమణారావు చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శుల సంఘ నాయకులు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, పరంశెట్టి ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

కె.గంగవరం: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ మృతికి కె.గంగవరం ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది సంతాపం ప్రకటించారు. మండల పరిషత్ కార్యా లయం వద్ద వెంకటరమణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యాలయం సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసు, కార్యాలయ సిబ్బంది, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, కార్యదర్శి ఎస్‌వీవీసత్యనారాయణ, గౌతమి పాల్గొన్నారు.

అయినవిల్లి: అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నర్సాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు మృతికి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి గరిమెళ్ల రవి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: నర్సాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణరావు మృతికి ఉద్యోగులు సంతాపం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెంకటరమణరావు చిత్రపటానికి ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి నివాళులర్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించి మౌనం పాటించారు.

అల్లవరం: నర్సాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణ మృతిపట్ల అధికారులు ఉద్యోగులు సంతాపం తెలిపారు. ఎంపీడీవో కృష్ణమోహన్ అధ్యక్షతన మండల పరిషత్‌లో జరిగిన సంతాప సభలో ఆయన ఆత్మశాంతికి మౌనం పాటించారు. వెంకటరమణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఏవో బి.లక్ష్మణరావు, ప్రశాంత్, అనిల్, నాగేశ్వరరావు, లక్ష్మి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

రాజోలు, జూలై 24: భారీ వర్షాలతో విద్యార్థులు విష జ్వరాల బారిన పడకుండా బుధవారం చింతలపల్లి గ్రామ సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి పంచాయతీ సిబ్బందితో జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పారిశుధ్య చర్యలు చేయించారు. బ్లీచింగ్ చల్లించి, ఎబేట్ దోమల నివారణా మందు పిచికారీ చేయించామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో మట్టా సురేష్, ఉప సర్పంచ్ బొక్కా రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాషువా వర్ధంతి

అమలాపురం టౌన్, జూలై 24: నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతిని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు మడికి సత్యనారాయణ అధ్యక్షతన వెంకటకృష్ణాపురం కాలనీలో జాషువా చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు మడికి శ్రీరాములు, నవుండ్రు వాడపల్లి, సీలి సంసోను, సిర్రా కాంతరాజు, నవుండ్రు లక్ష్మణరావు, సింగపల్లి ఏసుదాసు, నూటుకుర్తి శ్రీనివాస్, ఖండవల్లి సురేష్ పాల్గొన్నారు.

- వరద నీటిలో నానుతున్న పంట పొలాలు
- లంక గ్రామాల్లో పడవలపై ప్రయాణం
- వరద నీటిలో ఉద్యానవన పంటలు

ఇంకా కొనసాగుతున్న వరద ఉధృతి



కపిలేశ్వరపురం:శ్రీరాంపురం సమీపంలో వరదనీటిలో కొబ్బరితోట,



ఐ.పోలవరం: జలదిగ్బంధంలో మురమళ్ళ శ్మశానవాటిక,



అయినవిల్లి:యలకల్లంకలో ముంపు బారిన పడ్డ నివాసాలు,



రావులపాలెం: రెండు బ్రిడ్జిల మధ్య గోదావరి ప్రవాహం

ముమ్మిడివరం, జూలై 24: గోదావరి ఎగువ ప్రాంతంలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టినా దిగువన ఇంకా వరద ఉధృతి కొనసాగుతోంది. మండలంలో మంగళవారం రాత్రికి వరద నీటిమట్టం పెరగడంతో లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో మునిగాయి. గురజాపులంక వెళ్లే సిమెంటు రోడ్డు కూనాలంక వద్ద నుంచి నీట మునిగింది. రోడ్డుపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. లంకాఫ్ రాణేలంకలో మత్స్యకార కాలనీ రోడ్డు వరద నీట మునిగింది. కూనాలంక, లంకాఫ్ రాణేలంకల్లో లోతట్టు లంక భూములు నీట మునిగాయి. ముంపు ప్రాంతాల్లోని కొబ్బరికాయలు, కూరగాయల పంటలను దక్కించుకునే ప్రయత్నాలు చేపట్టారు. పశువులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లంక గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, మంచానికి పరిమితమైన రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లంక గ్రామాల్లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా చేస్తున్నారు. మండల వరద సహాయక ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ శ్రీనునాయక్‌లు లంక గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల వారు రాకపోకలకు నాలుగు ఇంజను బోట్లు, మూడు ఫైబర్ బోట్లు ఏర్పాటుచేశారు. లంకాఫ్ రాణేలంక పరిధిలోని గుత్తాలవారిపేటలో రెండు ఇళ్లు కోతకు గురవుతున్నాయి. వీఆర్వోలు స్థానికంగా ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కంట్రోల్‌రూమ్ కొనసాగుతుంది. లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లి లంక, చింతావానిరేవు, లంకాఫ్ రాణేలంక, గురజాపులంక, సలాదివారిపాలెం తదితర లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో మునిగి ఉన్నాయి. గోదావరి ఎగువన వరద క్రమేపీ తగ్గడంతో అధికారులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

నిలకడగా గోదావరి

కె.గంగవరం, జూలై 24: ఎగువప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో కోటిపల్లిగోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళ వారంతో పోల్చితే బుధవారం నిలకడగా ఉంది. మత్స్యకార కాలనీ, పుష్కరాలరేవు, ఫెర్రీ రేవు వరద నీటిలోనే ఉన్నాయి. సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టు పరిరక్షణకు తాత్కాలిక పటిష్ట చర్యలు చేపట్టారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వరద ఉధృతిని పరిశీలించారు.

లంక గ్రామాలను చుట్టిన వరద

అయినవిల్లి, జూలై 24: మూడు రోజుల నుంచి పెరుగుతూ వస్తున్న గోదావరి వరద బుధవారం మధ్యాహ్నం నుంచి నిలకడగా కొనసాగుతోంది. వరద ఉధృతి వల్ల లంక గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. లంక గ్రామాల్లో రైతులు పశువులను ఏటిగట్లపైకి తరలించారు. పల్లపు ప్రాంతాల్లోని ఇళ్ల చుట్టూ వరదనీరు ప్రవేశించింది. లంక గ్రామాల్లో సాగుచేసిన వంగ, బెండ, బీర, అనబ, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయి. ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు ముంపు గ్రామాలైన పొట్టిలంక, కొండుకుదురులంకల్లో పర్యటించారు.

వరద బాధితులకు వైద్య సదుపాయాలు

అంతర్వేది, జూలై 24: సఖినేటిపల్లి మండలంలో వరద ప్రాంతాల్లో తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు సేవలు అందిస్తున్నారు. తాగునీరు, వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి,పడవలపై వెళ్లి పడవలపై ప్రజలకు వైద్య సేవలు, తాగునీరు, ఇతర సదుపాయాలు అందిస్తున్నారు.

జలమయమైన లంకలు

పి.గన్నవరం, జూలై 24: ధవళేశ్వరంవద్ద వరద సాయంత్రం నెమ్మ దిగా తగ్గుముఖం పట్టింది. దీంతో సముద్రంలోకి విడుదల చేసే నీటి సామర్థ్యం కొంతమేర తగ్గింది. లంక గ్రామాల్లో పొలాలు సైతం నీట మునిగాయి. గ్రామాలు మాత్రం ప్రస్తుతానికి ఊపిరిపీల్చుకున్నాయి. గంటిపెదపూడి శివారు నాలుగు లంక గ్రామాలు, మానేపల్లి శివారు శివాయి లంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. లంకలగన్నవరం, నాగుల్లంక, మొండెపులంక గ్రామాల్లోకి కొంతమేర వరదతాకింది. కె.ఏనుగుపల్లిలో కాజ్‌వే పూర్తి స్థాయిలో నీటమునిగింది. ఏటిగట్టు దిగువన ఉన్న రెండు తాటాకిల్లు వరద తాకిడికి గురయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లా గ్రామాలు రాయిలంక, పెదమల్లంక, అనగార్లంక, అయోధ్యలంక, కనకాయలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. శివాయిలంకలో ప్రధాన రహ దారి వరదనీటిలో 11కేవీవిద్యుత్ తీగలపై తాడిచెట్టు విరిగి పడటంతో స్థానికులు సాయంతో చెట్టును తొలగించారు. సరఫరాను పునరుద్ధరించారు. ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, తహశీల్దార్ ఎస్‌కే హుస్సేన్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి కె.ఏనుగుపల్లి, శివాయిలంక, లంకలగన్నవరం తదితర ప్రాంతాల్లో వరద పరిస్థితిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గంటిపెదపూడి, మానేపల్లి, ఉడిమూడి గ్రామాల్లో తొమ్మిది పడవలులంక గ్రామస్తుల రాకపోకలు కోసం ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో తెలిపారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఐ.పోలవరం, జూలై 24:గోదావరి వరద ఉధృతితో మండలంలో లోతట్టుప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. వరదనీరు ప్రవహించి నదీతీరంలోని గృహాలు, పొలాలు నీట మునిగాయి. కేశనకుర్రు పంచాయతీ పల్లిగూడెం, పొగాకు లంక, జాంబవానిపేట, మురమళ్ల పుష్కరఘాట్, కొమరగిరి, ఎదురులంక, గుత్తెనదీవి గ్రామాల లోతట్టుప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న గోగుల్లంక, భైరవలంక గ్రామాలను వరదనీరు ముంచెత్తింది. మురమళ్ల శ్మశానవాటికలోకి నీరుచేరింది.పుష్కర్‌ఘాట్‌లోని గృహాలు ముంపులో ఉన్నాయి. వరద ప్రాంతాల్లో అధికారులు పర్యటించి బాధితులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కొబ్బరితోటల్లోని ఉత్పత్తులను, పశువులను రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.ఆక్వా రైతులు వీలైనంత వరకు ఉత్పత్తులను ఒబ్బిడి చేసుకుంటున్నారు.

వెంటాడుతున్న వరద కష్టాలు

మామిడికుదురు, జూలై 24: గోదావరికి వరద పోటెత్తడంతో లంక గ్రామాల ప్రజలను కష్టాలు వెంటాడుతున్నాయి. పాశర్లపూడిలోని శ్రీరాంపేట ప్రాంతంలో ఇళ్ల చుట్టూ వరదనీరు చేరడంతో మోకాలు లోతు వరద నీటిలో బయటికి రావాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ మంచినీటిని మోకాలు లోతు నీటిలో నిలబడి పట్టుకున్నారు. అప్పనపల్లి ఇందిరమ్మకాలనీ వరద నీటిలో మునిగింది. ఇళ్ల చుట్టూ వరదనీరు చేరడంతో బాధితులు ఇంటికే పరిమితమయ్యారు. అప్పనపల్లిలోని ఉచ్చులవారిపేట సమీపంలో బుధవారం ట్రాక్టరు బోల్తా కొట్టింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ట్రాక్టరును స్థానికులు వరద నీటి నుంచి బయటికి తీసుకువచ్చారు. లంక గ్రామాల్లో అరటి, కూరగాయ పాదులు వరద నీట మునిగి తేలుతున్నాయి. అపార నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాశర్లపూడి బాడవలోని కనకదుర్గమ్మ వారి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వరద నీటిలో మునిగింది. పెదపట్నం మధ్యలంకలో చిక్కుకుపోయిన గేదెలు, ఆవులను రైతులను వ్యయ ప్రయాసలకోర్చి బుధవారం సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అప్పనపల్లి కాజ్‌వేపై వరదనీరు చేరడంతో పూర్తిస్థాయిలో రాకపోకలు నిలిపివేశారు. పూర్వపు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉచ్చులవారిపేటకు వెళ్లే రహదారిలో పాటురేవుపై వంతెన నిర్మించడంతో లంక గ్రామాల ప్రజల కష్టాలు చాలా వరకు సమసిపోయాయి. వంతెన ఏర్పాటుచేసిన హిమాన్షు శుక్లాకు లంక గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్నారు.

పంట కాల్వలు శుభ్రం

అంబాజీపేట,జూలై 24: భారీ వర్షాలకు పంటపొలాల్లోకి చేరిన నీటిని మళ్లించేందుకు అధికారులుచర్యలు చేపట్టారు. అయినవిల్లి- పసుపల్లి సరిహద్దులో ఉన్న వక్కలంక పంట భూములు 150ఎకరాలు ముంపుబారిన పడ్డాయని స్థానిక రైతులు అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. దీంతో స్పందించిన అధికారులు ముంపునీటిని మళ్లించేందుకు ఉపాధి హామీ కూలీలతో పంటకాలువలను శుభ్రం చేయించారు. మురుగు డ్రైయిన్లలో పేరుకుపోయిన చెత్త, తుప్పలను తొలగించారు. దీంతో ముంపునీరు బయటకు మళ్లించేందుకు మార్గం ఏర్పడింది. పుల్లేటికుర్రులో ఎంపీడీవో జీవీ సరోవర్, ఏవో సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏపీవో చంద్రమోహన్‌లు పల్లపు ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో డ్రైయిన్లలో గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరారు.

వరద నీటిలో ఉద్యాన పంటలు

కపిలేశ్వరపురం,జూలై 24: కేదార్లంక,వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక, కోరుమిల్లిలంక తదితర లంక గ్రామాల్లోని ఉద్యాన పంటలు వరద నీటిలో చిక్కుకున్నాయి. లంక పొలాల్లో కూరగాయపంటలు, అరటి, మొక్కజొన్న తదితర పంటలకు వరదనీరు చేరింది. అవి పనికి రాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లపులంక ప్రాంతాలకు నీరుచేరడంతో పశువులను మెరక ప్రాంతాలకు తరలించారు. పసుగ్రాసం కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటుక బట్టీల చుట్టూ వరదనీరు చేరడంతో అమ్మకాలు లేక బట్టీయజమానులు ఆందో ళన చెందుతున్నారు. కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంకగ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్య అందిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు కార్యదర్శులు తెలిపారు.

యానాంలో నిలకడగా వరద ప్రవాహం

యానాం,జూలై 24: ఎగువున కురుస్తున్న వర్షాలుప్రభావంతో గోదావరికి వరదనీరు పోటెత్తడంతో యానాం జీఎంసీబాలయోగి వారధి వద్ద వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ధవళేశ్వరం నుంచి వరద నీరు సముద్రంలోకి వదలడంతో యానాం గౌతమి గోదావరి మీదుగా సముద్రంలోకి చేరుతుంది. యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పలు పర్యాటక కట్టడాలు, పర్యాటక కేంద్రాలు వరద ముంపునకు గురయ్యాయి. పరిపాలనాధికారి మునిస్వామి నేతృత్వంలో వరద పరిస్థితిపై అధికారులతో సమీక్షా నిర్వహించి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. భద్రాచలంలో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ 3రోజులు తర్వాత యానాంలో వరద తగ్గుతుంది.

గోదావరి వరద నీటిలోనే పంటలు

ఆలమూరు జూలై 24: గోదావరివరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. ఆలమూరు మండలంలోని పలు గ్రామాల్లో లంక భూముల్లో వాణిజ్య పంటలు వరద నీటిలోనే మునిగి ఉన్నాయి. ఆలమూరు వద్ద వరద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉరకలేస్తున్న గోదారమ్మను తిలకించడానికి సందర్శకులు తరలివస్తున్నారు. జొన్నాడ పుష్కర ఘాట్ వద్ద ఉన్న ఆలయాలు వరదనీటిలో మునిగిపోయాయి. గోదావరి ఎగువ ప్రాంతంలో వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతుండటంతో బడుగువానిలంక వాసులు ఊపిరిపీల్చుకుంటున్నారు. పంటభూములు వరదనీటిలో మునిగిపోవడంతో తీవ్ర నష్టం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

వరద ముంపులో మత్స్యకారుల నివాసం

అల్లవరం,జూలై24: వైనతేయ గోదావరికి వరద నీరు పోటెత్తి బోడసకుర్రు పల్లిపాలెంలో 40ఇళ్లు జలదిగ్బంధంలో ఉన్నాయి. బుధవారం వైనతేయ వరద నిలకడగా ఉంది. బోడసకుర్రు స్కూల్‌లోని పునరావాస కేంద్రంలో వరద బాధితులకు టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, తహసీల్దారు పి.సునీల్‌కుమార్, ఎంపీడీవో కృష్ణమోహన్, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి భోజనాలు వడ్డించారు. బోడసకుర్రు వరద బాధితులకు ప్రభుత్వ పరంగా అధికారులు దగ్గరుండి సేవలు అందించడం ప్రశంసనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అన్నారు. యాళ్ల దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు, సుంకర సాయి పడవపై వెళ్లి వరద బాధితులను పరామర్శించారు. పునరావాస కేంద్రంలో భోజనాలు ఏర్పాట్లను పరిశీలించారు. అడపా శ్రీనివాసరావు, ఓలేటి పరమేశ్వరరావు, రొక్కాల నాగేశ్వరరావు, చింతా శ్రీని వాసరావు, ముత్యాల బాబి, కార్యదర్శి ఎస్.దుర్గా శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి వరదప్రాంతంలో పర్యటించారు. వరద బాధితులకు మంచి నీటి సరఫరా చేశారు. డీఎల్‌పీవో బొజ్జిరాజు పునరా వాస కేంద్రంలో ఏర్పాట్లపై సమీక్షించారు. గోపాయిలంక, రెబ్బనపల్లి తదితర లోతట్టుప్రాంతాలకు వరద నీరు చేరింది.

గుడారాలు వేసుకుని జీవనం

ఆత్రేయపురం, జూలై24: ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతూనే ఉంది. గోదావరి నిలకడగానే ఉండటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. పిచ్చుకలంక, వాడపల్లిలంకల్లో ఇళ్ల వద్దకు నీరు చేరుకుంది. సురక్షిత ప్రాంతాల్లో గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటను నిషేధించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీటీసీ సభ్యులు



అమలాపురం టౌన్, జూలై 24: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జనసేన ఎంపీటీసీ సభ్యుల బృందం బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసింది. త్వరలోనే అన్ని గ్రామాలకు వచ్చి ప్రజలను కలుసుకుంటానని కలెక్టర్ వారికి తెలిపారు. కార్యక్రమంలో ఆకుల బుజ్జి, మోటూరి కనకదుర్గ-వెంకటేశ్వరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ బి.కృష్ణారావును ఎంపీటీసీలు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.

వైద్యులు, సిబ్బంది పనితీరుపై నాయకుల ఆగ్రహం

ఆలమూరు, జూలై24:ఆలమూరుఆసుపత్రి పనితీరుపై తెలుగుదేశం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆసుపత్రిలో కొత్తపేట నియోజకవర్గ టీడీపీ యువనేత బండారు సంజీవ్ ఆధ్వర్యంలో నాయకులు ఆసుపత్రి పనితీరును పరిశీలించారు. సరైన వైద్య సేవలు అందడంలేదని ఇటీవల కాలంలో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అనేక ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. బండారు సంజీవ్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు, ఈదల సత్తిబాబు, వక్కపట్ల లక్ష్మణరావు తదితరులు ఆస్పత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో ఆరుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఒకరు మాత్రమే డ్యూటీలో ఉండటాన్ని ప్రశ్నించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓపీ చూడాలని కాకపోతే నాలుగు గంటల తర్వాత చూడటం లేదని పలువురు టీడీపీ నాయకులు దృష్టికి తీసుకొచ్చారు. తక్షణం పనితీరు మార్చుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో శిక్ష సప్తాహ వారోత్సవాలు

రాజోలు, జూలై 24: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ వారోత్సవాలు ఈనెల22నుంచి 28వరకు జరగనున్నాయని జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం శివకోటి గురుకుల పాఠశాల, రాజోలు బాలుర ఉన్నత పాఠశాలల్లో రోజువారీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తొక్కుడుబిళ్ల, దాగుడుమూతలు, చుక్కలాట, తాడాట తదితర 75రకాల ఆటలను పిల్లలతో ఆడిస్తున్నామన్నారు. ఎంఈవో ఎస్.మనోహరం, హెచ్ఎంలు కె.సరస్వతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం ఆర్థిక సాయం

ద్రాక్షారామ, జూలై 24: పట్టణంలోని శెట్టిబలిజ కల్యాణ మండపంలో 30ఏళ్లుగా సేవలందిస్తున్న గుబ్బల సత్యనారాయణ(82) అనారోగ్యంతో మృతి చెందాడు. తాలూకా శెట్టిబలిజ సంఘం తరపున బుధవారం సంఘ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు నరాల ఏడుకొండలు, కార్యదర్శి వాసంశెట్టి లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యుడు కడలి రామకృష్ణలు కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు. కుమార్తెలు యల్లబోయిన మంగ, గెద్దాడ పద్మావతి, కుమారుడు గుబ్బల నాగేశ్వరరావుపాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ

అంబాజీపేట, జూలై 24: విజయవాడ శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి అంబాజీపేట భవాని సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం సారెను సమర్పించారు. స్థానిక గురుభవానీలు దంగేటి మల్లేశ్వరి-సాయిబాబు దంపతులు మట్టపర్తి శ్రీనివాస్, ఏసు, దుర్గాప్రసాద్, కేతా దొర, సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, 27రకాల స్వీట్లు, పండ్లు సమర్పించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండి, పాడి పంటలు సమృద్ధిగా చెందాలని అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమన్వయంతో ముందుకెళ్లాలి

మలికిపురం, జూలై 24: రాజోలు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలని రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెన రామ్మోహనరావు అన్నారు. బుధవారం లక్కవరంఎంజీ గార్డెన్స్‌లో జరిగిన రాజోలు నియోజకవర్గస్థాయి టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చూడాలన్నారు. కష్టపడి పనిచేసిన నాయకులకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు వాటంతటవే వస్తాయన్నారు. సమావేశానికి అడబాల యుగంధర్ అధ్యక్షత వహించగా గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, రాపాక నవరత్నం, చాగంటి స్వామి, తాడి సత్యనారాయణ, వర్ధినీడి బాబ్జి, దంతులూరి రామకృష్ణంరాజు, మంగెన రాధాకృష్ణ, చెల్లింగిసత్యనారాయణ, అడబాల సాయిబాబు, భూపతిరాజు సాయిబాబు, కాకి లక్ష్మణ్, మంగెన భూదేవి, బందెల పద్మ, కోట పుష్పకుమారి, చెల్లుబోయిన హెలీన, కాండ్రేగుల భవానీ లావణ్య,అడబాల రమాదేవిపాల్గొన్నారు.

రోటరీ సేవలు ప్రశంసనీయం

మలికిపురం, జూలై 24: 30ఏళ్లుగా మలికిపురం రోటరీ క్లబ్ ఈ ప్రాంతంలో అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం వీఆర్కే ఫంక్షన్ హాలులో మలికిపురం రోటర్లీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార సభలో ఆయన మాట్లాడారు. నూతన అధ్యక్షుడిగా బత్తులలరూసీబాయి, కార్యదర్శిగా ఎం.రవికుమార్, కోశాధికారి పి.సతీష్‌లతో ఇనస్టలేషన్ ఆఫీసర్ డ్వాకర్ బసవా వరమాలు ప్రమాణ స్వీకారం చేయించారు. రూసీబాయిని పలువురు దుశ్శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ మిరియాల శ్రీనివాస్, ఎస్.మురళీకృష్ణ, నల్లి శివ, గుబ్బల బాబ్జి, గెద్దం తులసీభాస్కర్ పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పూడిక తీశారు.. ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉప్పలగుప్తం, జూలై 24: ఆ డ్రెయిన్ మాది కాదంటే మాది కాదన్నారు. పొలాలు పీకల్లోతు నీటిలో ఊపిరాడక కుళ్లిపోయే దశకు చేరుకున్నాయంటూ రైతులు గగ్గోలు పెట్టారు. ముంపునీరు దిగేందుకు మార్గం సుగమం చెయ్యాలంటూ రైతులు ఉన్నతాధికారులను అభ్యర్థించారు. ఈసమస్యపై రెయినూ...డ్రెయినూ శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ ఆధ్వర్యంలో బుధవారం యంత్రాలతో డ్రెయిన్‌లో పూడిక తీశారు. ఈఅంశంపై తహసీల్దార్ మాట్లాడుతూ గొల్లవిల్లి బ్రాంచి డ్రెయిన్ ప్రభుత్వ రికార్డుల్లో లేని మాట వాస్తవమేనన్నారు. తమ అవసరాలకు అనుగుణంగా గతంలో రైతులే స్వయంగా డ్రెయిన్ తవ్వుకున్నారని అన్నారు. ఇరిగేషన్ శాఖకు నిధులు విడుదల చేశారని రెవెన్యూ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయన్నారు.


తాటాకిల్లు దగ్ధం

ఉప్పలగుప్తం, జూలై 24: మునిపల్లిలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తిరుకోటి సురేష్‌కు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. సామగ్రి, నగదు కాలి బూడిదయ్యాయి. ఆస్తి నష్టం రూ2.50 లక్షల వరకు ఉండవచ్చని అంచనా.బాధితులను సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీవో కొరాఠి వెంకటేశ్వరప్రసాద్ బాధితులను పరామర్శించి, ప్రభుత్వ సహాయం అందించారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం, జూలై24: వల్లూరు పాతూరి మాధవరావు మిల్లు వద్ద గురువారం రాజానగరానికి చెందిన లెనోరా డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్ర పునర్నిర్మాణమే చంద్రబాబు లక్ష్యం



రావులపాలెం, జూలై 24: వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధిని తిరిగి పరుగులు పెట్టించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే విధంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలుగు యువత జిల్లాఅధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు చెప్పారు. రావులపాలెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత స్థానం దక్కిందన్నారు.

ఆంధ్ర అభివృద్ధికి నిధులు చంద్రబాబు ఘనత



మంత్రిలోకేష్‌ను కలసిన అక్కల రిష్వంత్‌రాయ్

రామచంద్రపురం, జూలై 24: కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో ఏపీకి భారీ ఎత్తున నిధులు, ప్యాకేజీలు సాధించిన చంద్రబాబుకు తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం అసెంబ్లీ ఆవరణలో మంత్రి నారా లోకేష్‌ను రిష్వంత్‌రాయ్ కలిశారు. రాజధాని అభివృద్ధికి రూ.15వేలు కోట్లు, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పోలవరం పూర్తికి కేంద్రం భరోసా ఇవ్వడం, పారిశ్రామికకారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు కేటాయింపు జరపడం ఎన్‌డీఏ కూటమి ఘనత అన్నారు.

దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

ద్రాక్షారామ, జూలై 24: దివ్యాంగులకు ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ క్షమాపణలు చెప్పాలని దివ్యాంగుల హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు డిమాండు చేశారు. దివ్యాంగులను కించపరిచేలా, హేళనచేసేలా సబర్వాల్ ట్విట్టర్‌లో చేసిన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు.

మెదడు వ్యాధిగ్రస్త బాధితునికి సాయం

మామిడికుదురు, జూలై 24: లూటుకుర్రు గ్రామానికి చెందిన బొంతు వెంకటేశ్వరరావు(బుజ్జి) మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మామిడికుదురు శెట్టిబలిజ సంఘ సభ్యులు విరాళాలు సేకరించి రూ.22,200 బాధితుడికి అందించారు. కార్యక్రమంలో గుబ్బల శ్రీనివాస్, కాండ్రేగుల శ్రీనివాస్, కడలి నూకరాజు, పెచ్చెట్టి సత్యచంద్ర, వాసంశెట్టి రామకృష్ణ, చప్పిడి సూరిబాబు, చింతపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరం

అంబాజీపేట, జూలై 24: వైనతేయ గోదావరి పోటెత్తడంతో మండలంలో నందంపూడి, తొండవరం, వాకలగరువు తదితర నదీతీర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. నందంపూడి పంచాయతీ పరిధిలోని బొంతువారిపేటలో పలు ఇళ్లు జలదిగ్బంధంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో అంబాజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ జె.ప్రసాద్, వైద్య సిబ్బంది పలువురికి వైద్య పరీక్షలు చేశారు.

జనసేన సభ్యత్వాలు నమోదు

అంతర్వేది, జూలై 24: సఖినేటిపల్లి మండలంలో జనసేన క్రియాశీలక సభ్యత్వాలు 200పైగా నమోదయ్యాయని పార్టీ సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు అన్నారు. అంతర్వేది దేవస్థానం గ్రామంలో క్రియాశీలక సభ్యత్వ నమోదులో బుధవారం పాల్గొని పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఉండపల్లి అంజి, ఎంపీటీసీ బైరా నాగరాజు, డి.బాబి, పాండు, గుండుబోగుల సాయినరసింహ, దాసరి కొండ తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి మేలు చేసిన బడ్జెట్

రావులపాలెం, జూలై 24: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కారణంగా రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతుందని బీజేపీ కొత్తపేట అసెంబ్లీ కో కన్వీనర్ గంగ్రేతు వీరగోవిందరావు, బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుడు పొనుగుపాటి శ్రీనివాస్ అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో అమరావతి, పోలవరం తదితర అభివృద్ధి కార్యక్రమాలు అన్ని కూడా ముందంజలో దూసుకువెళ్లే అవకాశం ఉందన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఫర్నిచర్ మాయం

రాజోలు,జూలై24: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇన్వర్టర్ బ్యాటరీలు పెట్టుకునే ఐరన్ ర్యాక్ ఒకటి, పాత కుర్చీ ఒకటి ఆర్ఐ శ్రీనివాస్ ఇంటికి తీసుకువెళ్లారు.తహశీల్దార్ గోపాలకృష్ణను వివరణకోరగా ఆర్ఐ సామగ్రిని ఇంటికి తీసుకువెళ్లడం వాస్తవమేనన్నారు. ఆర్ఐను మందలించడంతో ఐరన్ ర్యాక్‌ను, పాత కుర్చీని కార్యాలయంలో పెట్టేశారని తహశీల్దార్ తెలిపారు.

రేపు తొండవరంలో వైద్య శిబిరం

అమలాపురంటౌన్, జూలై24: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సౌజన్యంతో ఈనెల26న అంబాజీపేట మండలం తొండవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అమలాపురం రెండోఅదనపు జిల్లాజడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షుడు వి.నరేష్ తెలిపారు. మధ్యాహ్నం2నుంచి సాయంత్రం4గంటలవరకు వాకలగరువు పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అంతర్వేది, జూలై 24: అంతర్వేదిపల్లిపాలెం బీచ్‌ఒడ్డున 45ఏళ్ల పురుషుడి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. అతడి శరీరంపై తెల్లని చొక్కా, సిమెంటు రంగు నిక్కరు ఉన్నాయన్నారు. కేసు నమోదుచేశామని, వివరాలు తెలిస్తే సఖినేటిపల్లి పోలీసులకు (9440796566) తెలపాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం, జూలై 24: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. రాజేలంక పంచాయతీ పరిధి బూరుగులంకకు చెందిన చింతలపూడి లోవరాజు(30) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల12న పురుగుల మందు తాగాడు. అతన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడు బుధవారం మృతిచెందాడు. అతడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ డి.సురేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముమ్మిడివరం, జూలై 24: బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై యానాం వెళ్లి తిరిగి వస్తున్నారు. ముమ్మిడివరం కొండాలమ్మచింత బైపాస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న కె.జగన్నాధపురానికి చెందిన మోటారు సైకిలిస్టు ఎం.వెంకటేశ్వరరావును వారు ఢీకొట్టారు. ఈప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంకటేశ్వరరావును అమలాపురం ఏరియా ఆసుపత్రికి, మిగతా ఇద్దరినీ అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్లను అభివృద్ధి పరచాలి

మామిడికుదురు, జూలై24: పి.గన్నవరం నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లను ఆధునికీకరించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. తన నియోజకవర్గంలో రోడ్లన్నీ గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈసమస్య పరిష్కరించాలంటూ మంత్రికి ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గంలో ఉన్న రోడ్ల సమస్యను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.